క్లుప్తంగా

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సుభాషిణి



యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన జిల్లా నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఏలూరు జిల్లా నుంచి బి.సుభాషిణి ఎంపికయ్యారు. విజయవాడలో శని, ఆదివారాల్లో నిర్వహించిన యూటీఎఫ్ 48వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల ముగింపు సందర్భంగా ఆదివారం రాష్ట్ర నూతన కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించగా ఏలూరు జిల్లా నుంచి ఇప్పటివరకు జిల్లా సహాధ్యక్షులుగా ఉన్న సుభాషిణి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆమెతో పాటు ఏలూరు జిల్లా నుంచి జిల్లా అధ్యక్షుడు ఆర్.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పూరేటి శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సంఘానికి ఎంపికైన జిల్లా నాయకులను జిల్లాలోని ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు అభినందించారు.

అన్నసమారాధన

ఏలూరు రూరల్: పాలగూడెంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక కృష్ణ సాయి యాదవ సంక్షేమ సంఘం గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు శ్రీసీతారామకల్యాణ మహోత్సవం చేపట్టింది. ఈ సందర్భంగా ప్రతిరోజూ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

డీఈఈపై సమగ్ర విచారణ చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో డీఈఈ వంగపండు సత్యనారాయణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సోమవారం జరిగే విచారణను సమగ్రంగా చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని గతంలో ఏసీబీకి చిక్కి జైలు జీవితం అనుభవించిన సత్యనారాయణ తిరిగి ఏలూరు కార్పొరేషన్‌లో డీఈఈగా ఎలా చేరారని ప్రశ్నించారు. ఆ అధికారి సర్వీస్ రిజిస్టర్‌ను విచారణ అధికారి క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఏసీబీ కేసులో జైలు జీవితం అనుభవించిన ఏ ఉద్యోగైనా తిరిగి అదే చోట పని చేయవచ్చా అంటూ సందేహం వ్యక్తం చేశారు.

పేదల అభివృద్ధి, సంక్షేమానికే పెద్దపీట

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని
- 10వ డివిజన్‌లో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం



వన్‌టౌన్‌లో సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేదవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు నగరంలో 83వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం 10వ డివిజన్‌లో కార్పొరేటర్, నగర పాలక సంస్థ విప్ పైడి భీమేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎమ్మెల్యే నానికి డివిజన్‌లోని ప్రజలు, నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. ఏలూరు వన్‌టౌన్ కల్పనా థియేటర్ ప్రాంతం నుంచి పాదయాత్రగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిశారు. అనంతరం 2వ డివిజన్ కార్పొరేటర్ జున్నూరు కనక నరసింహారావు ఆధ్వర్యంలో బావిశెట్టివారిపేట శివాలయం నుంచి పాదయాత్రగా ఎమ్మెల్యే నాని రెండు ప్రాంతాల్లోనూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అవ్వాతాతలను పింఛన్ సక్రమంగా అందుతుందా అంటూ అడిగి తెలుసుకున్నారు. మహిళలకు సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి. ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలని అధికారులకు ఎమ్మెల్యే నాని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో ఏమైతే హామీలు ఇచ్చారో వాటిలో 90 శాతం అమలు చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చారు, ఎన్ని అమలు చేశారో ప్రజలకు తెలుసన్నారు. 600లకు పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రజలకు దారుణంగా మోసం చేశారని విమర్శించారు. ప్రజలకు మేలు చేయటమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, పొలిమేర దాసు, దేవరకొండ శ్రీనివాస్, కే.సత్తిబాబు, కలవకొల్లు సాంబ, సుంకర చంద్రశేఖర్, పార్టీ వాణిజ్య సెల్ నాయకులు మోటమర్రి సదానందం, బండారు కిరణ్‌కుమార్, లీగల్‌సెల్ ప్రత్తిపాటి తంబి, పిట్టా ధనుంజయ్, నున్న కిషోర్, జిజ్జువరపు రమేష్, సన్నీ చైతన్య, యల్లాపు మోజెస్, వైఎస్‌వీ శివ, కొప్పుల ప్రభాకర్ రెడ్డి, నంబూరు వేణుగోపాల్, మాజీ ఏఎంసీ చైర్మన్ కుర్మెళ్ల రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీల సమగ్ర కులగణన చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిచ్చుక ఆదిశేషు

ఏలూరు (టూటౌన్): బీసీల సమగ్ర కులగణన చేయాలని ఏపీ బీసీ హక్కుల సాధన పోరాట వేదిక సమావేశం కోరింది. స్థానిక ఆర్ఆర్ పేటలోని సంఘ కార్యాలయంలో కమిటీ జిల్లా సమావేశం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఏలూరు నగర కార్యదర్శి కొత్తల శివకుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. అసోసియేషన్ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ ఈ నెల 5న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి, ఈనెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి, ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను సంఘ కార్యాలయంలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. బీసీ సంఘాల నాయకులు, వృత్తి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు కెల్లా దుర్గాప్రసాద్, కాటకోటి సూర్యప్రకాశరావు, ఉద్దవల్లి కిషోర్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- గురుకులపేటలో గడపగడపకు మన ప్రభుత్వం



గురుకులపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందుతున్నాయని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏలూరు మండలం మాదేపల్లి పంచాయతీ గురుకులపేటలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ, వర్గ భేదాలు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. లక్షలాది మంది పేదల సొంతింటి కల నెరవేర్చడంతో పాటు పథకాలతో ఆర్థిక భరోసా, ఆరోగ్య భద్రత కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వం అన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి అర్హులను గుర్తించి పథకాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందిస్తూ వాటిని పరిష్కరించాలని మండల పరిషత్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. పార్టీ స్థానిక నాయకుడు గుర్రం సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 9 గంటలకు ముగిసింది. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి, ఏపీఓ కిషోర్, పార్టీ నాయకులు పీవీరావు, సర్పంచ్ కొరపాటి ప్రభుదేవ్, తేరా ఆనంద్, మండల కొండలరావు, పల్లెం ప్రసాద్, నరహరశెట్టి రాధాకృష్ణ, బొల్లిముంత రామ్మోహనరావు, గుర్రం శివ, పంచాయతీ వార్డు సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను పేదలకు పంచండి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఏలూరు (టూటౌన్): దెందులూరు మండలం దోసపాడులో పేదలు, దళితులకు అసైన్డ్, సీలింగ్ భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రవి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఉన్న అసైన్డ్, సీలింగ్, గయాళ భూములను పంచాలని పోరాటం చేస్తున్నారన్నారు. ఈ భూములు గత 25 ఏళ్ల నుంచి స్థానికేతర భూస్వాములు దౌర్జన్యంగా భయభ్రాంతులకు గురిచేసి పేదల నుంచి లాక్కున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా, మండల రెవెన్యూ అధికారులు, కలెక్టర్ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దోసపాడు పేదలు కోరుతున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ భూములకు సంబంధించి 2015లో లోకాయుక్త పేదలకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా ఇప్పటివరకు భూమిని పంచలేదన్నారు. గ్రామంలో 144, 145 సెక్షన్లు పెట్టి పేదలను భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. ఈ నెల 10లోగా దోసపాడు పేదల, దళితులకు భూములను పంచాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు పరస్పరం సహకరించుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంబీఎస్ శర్మ తదితరులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధార్మిక ప్రవృత్తితో సమాజ హితం కోరుకునే బ్రాహ్మణులు పరస్పర స్వావలంబన, సహకారం అందించుకోవాలని అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంఘ భవనంలో నిర్వహించిన బ్రాహ్మణ వధూవరుల మెగా ఉచిత వివాహ పరిచయ వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రాహ్మణ యువతలో విద్యావంతులు, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన వారు ఉన్నారన్నారు. అయినప్పటికీ వారి వివాహాలు ఆలస్యం కావడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత యువకులకు వధువులు లభించడం కష్టతరంగా ఉందని, ఆదివారం నిర్వహించిన పరిచయ వేదికలో సుమారు 700 మంది వరులు నమోదు చేసుకోగా కేవలం 215 మంది మాత్రమే వధువులు నమోదు చేసుకోవడం పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. ఈ వేదిక సందర్భంగా సుమారు 25 మంది వధూవరుల తల్లిదండ్రులు పరస్పర అంగీకారం చేసుకోవడంతో తమ ప్రయత్నానికి సార్థకత లభించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివాహ పరిచయ వేదికలు ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తున్న పెండ్యాల వెంకట ప్రసాద్‌ను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. తొలుత బ్రాహ్మణ వధూవరుల వివరాలతో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించి, హాజరైన వధూవరుల తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. వివాహ సదస్సుల కన్వీనర్ మైలవరపు గురుశర్మ, సంఘ కార్యదర్శి మోరపాకల భానుమూర్తి, కోశాధికారి డీవీఎస్ సుబ్బారావు, సంఘ ప్రతినిధులు తమ్మెర రామారావు, పాలంకి దుర్గా ప్రభాకరం, నిట్టల నాగేశ్వరరావు, మొక్కపాటి శ్రీరామచంద్రమూర్తి, మద్దాలి భాస్కర శ్రీనివాస నాగరాజు, ఎంఎస్ శర్మ పాల్గొన్నారు.

మేలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలను మే నెలలో చేపట్టాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎల్ నారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల సర్వీస్ రూల్స్ అమలు చేయడానికి ముందు ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించి, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ద్వారా దూరప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన రాబోయే కౌన్సిలింగ్‌లో స్థానాలు కేటాయించాలని కోరారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.శామ్యూల్ మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, బదిలీ కోడ్ రూపొందించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కే.పవన్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను పూర్తి స్థాయిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ కోర్టు కేసులు పరిష్కరించి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్ ప్రకాష్, సీనియర్ నాయకుడు డీవీఏవీ ప్రసాద రాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేవీఎస్ మల్లేశ్వర రావు, సీనియర్ నాయకుడు గంటా రవిచంద్ర మోహన్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	08-10
బెండకాయలు	34	కంద	40
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-40	కీరా దోస	30
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	100
బీరకాయలు (పందిరి)	40	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24-30	బజ్జీ	56
ఆనపకాయ (1)	15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	27
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	30
ఏలూరు –తిరుపతి	16.00	4830	31
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	31

సర్వమానవాళికి ఖురాన్ మార్గదర్శకం



బ్రదర్ సిరాజ్ ఉర్ రెహమాన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఖురాన్ గ్రంథం సర్వమానవాళికి మార్గదర్శకం అని పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ సిరాజ్ ఉర్ రెహమాన్ అన్నారు. స్థానిక మినీ బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి స్థానిక ముస్లింల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధార్మిక సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అరబీ సంప్రదాయం ప్రకారం 12 మాసాల్లో 9వ మాసం రంజాన్ మాసం అని, ఈ మాసంలోనే దివ్య గ్రంథం ఖురాన్ అవతరించిందన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించడం ముస్లింలకు విధిగా చేయబడ్డాయని, తద్వారా ప్రాపంచిక ప్రయోజనంతో పాటు ధార్మిక ప్రయోజనాలు కూడా కలగడంతో పాటు ప్రతి ఒక్కరిలో దైవ భీతి (తఖ్వా) జనిస్తుందన్నారు. ఉపవాసం అంటే ఆకలి దప్పికల పేరు మాత్రమే కాదని, మనిషికి ఒక ధార్మిక శిక్షణ కాలం వంటిదన్నారు. మత గ్రంథాల ప్రకారం మన అందరి సృష్టికర్త దైవం ఒక్కడే అన్నారు. గ్రంథ పరిజ్ఞానం లేక నేడు కొందరు ముస్లింలు సమాధులను కూడా ఆరాధించడం బాధాకరమన్నారు. దైవం చెప్పిన విధంగా జీవితం గడిపిన వారే అందరికన్నా గొప్పవారన్నారు. ఏలూరు నగర పాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు బ్రదర్ సిరాజ్ ఉర్ రెహమాన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధప్రాంతాల్లో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టలను సుందరంగా అలంకరించి విశ్వాసులు, చిన్నారులు నగర వీధుల్లో ప్రదర్శన చేశారు. అనంతరం ఏసుక్రీస్తు సిలువ సువార్తను నినాదాలతో ప్రకటించారు. స్థానిక విద్యానగర్‌లోని హోలీ ట్రినిటీ లూథరన్ సంఘంలో నిర్వహించిన మట్టలలాదివారం కార్యక్రమంలో సంఘ ప్యారిష్ పాస్టర్ కిరణ్ పీవీఎస్ మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు సర్వమానవాళి కోసం తన ప్రాణాలను సిలువలో సమర్పించారని, తిరిగి మూడో రోజు సజీవుడై వచ్చాడన్నారు. క్రీస్తును నమ్ముకుంటే మోక్షం, సుఖ సంతోషాలు కలుగుతాయన్నారు. ఈ ఆరాధన కార్యక్రమంలో పీ.దనాకిరణ్, బీ.కాంతి రవికిరణ్, పీ.రవి కుమార్, బీ ప్రవీణరామ్, విశ్వాసులు, కన్యాస్త్రీలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

10లోగా 'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తు చేయండి

ఏలూరు టౌన్: సమాజంలో ఆదరణ కరువైన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలలను ఆదుకునేందుకు ప్రత్యేకమైన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఆదివారం చెప్పారు. అనాథలైన పేద బాలలకు ఆరోగ్యం, విద్య అవసరాలకు నెలకు రూ.4వేలు ఆర్థిక సహాయాన్ని ఈ పథకం కింద అందిస్తారన్నారు. తల్లిదండ్రి కోల్పోయిన బాలలు, వీధి బాలలు, బాల కార్మికులు, వికలాంగులు, హెచ్ఐవీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, ఒంటరి మహిళలు, వితంతువులు ఈ పథకంలో లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. కటిక దారిద్ర్యంలో ఉంటూ ఏ విధమైన సంపాదన లేని కుటుంబాలు వారి పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. పిల్లల వయస్సు 18 ఏళ్లు నిండే వరకూ ఈ ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. అమ్మ ఒడి, పింఛన్లు వంటి పథకాలు తీసుకునే వారు సైతం ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. వసతి దీవెన, హాస్టల్‌లో చదివే విద్యార్థులకు ఈ పథకం వర్తించదని స్పష్టం చేశారు. మూడు నెలలకు ఒకసారి రూ.12 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. దరఖాస్తు పత్రాలను సమీపంలోని సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా సంరక్షణ కార్యదర్శికి అందజేయాలని తెలిపారు. ఈనెల 10తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

పెదవేగి : ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించవచ్చని గ్రామసేవక్ సమితి ఏలూరు సేవక్ తిరుపతయ్య పేర్కొన్నారు. పెదవేగి మండలం భోగాపురంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిరుపతయ్య మాట్లాడుతూ మన పూర్వీకుల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, మధ్యలో బ్రిటీష్ వారి పరిపాలనలో ఆధునిక వ్యవసాయాన్ని మనకు అంటగట్టారన్నారు. అందరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఏపీఏ సరోజిని మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగిస్తూ జీవామృతం తయారీ నుంచి వాటి వినియోగంపై రైతులకు వివరిస్తున్నట్లు తెలిపారు. నడిపల్లి రామరాజు ఆధ్వర్యంలో జీవామృతం తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యకర్తలు సత్తిబాబు పాల్గొన్నారు.